క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



తిరువూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తిరువూరు సీఐ రుద్రరాజు భీమరాజు అన్నారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్రాష్ట్ర క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించి, సీఐ మాట్లాడుతూ.. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులకు ఉన్నత చదువుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయరన్నారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. తిరువూరు, మైలవరం, నూజివీడు, విజయవాడ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో తలపడ్డారు.

భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ



గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి గురువారం మహిళలు సారె సమర్పించారు. తెల్లవారుజామున తిరుప్పావై పఠనం గావించారు. అనంతరం పసుపు, కుంకుమలు, 116 రకాల సారె సామగ్రితో పాటు మహిళలు శ్రీకృష్ణపరమాత్మ, గోదాదేవి అమ్మవారి చిత్రపటాలతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో మేళతాళాలతో గ్రామోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అర్చకులు దేవయనిజం శ్రీధరాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ, గోదాదేవి, రంగనాయకస్వామి, లక్ష్మీదేవి అష్టోత్తర పూజలను జరిపారు. 150 మంది మహిళలకు దాతల సహకారంతో చీరలు, ప్రసాదం పంపిణీ చేశారు.

వైఎస్సార్ జలకళతో ఆనందం



రెడ్డిగూడెం: మండలంలోని పాతనాగులూరు గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకంతో రైతులు ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు గుజ్జుల కోటిరెడ్డి అన్నారు. గ్రామంలో రైతులకు బోర్లు వేయించారు. కోటిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో రైతే రాజులాగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి రైతు పొలంలో బోర్లు వేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సచివాలయం కన్వీనర్ ఎం.గంగరాజు, నాగరాజు, రైతు భీమిరెడ్డి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీడీ సొసైటీ డైరీ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(ఏపీటీడీ) క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం అన్నారు. ఉద్యోగులతో కలిసి సొసైటీ డైరీని గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు లోన్ కోసం సొసైటీని ఆశ్రయిస్తే రూ.0.91 పైసల వడ్డీతో రుణం మంజూరు చేస్తారన్నారు. పిల్లల విద్యకు కూడా రుణాలు ఇస్తారని తెలిపారు. సీసీఎస్ సభ్యులు ఎన్.అనంత రాములు మాట్లాడుతూ గతంలో లేని విధంగా పండుగల పేరుతో రూ.20 వేలు వరకు ఉద్యోగులకు లోన్ ఇస్తారన్నారు. నూతన సాఫ్ట్‌వేర్‌తో సత్వర సేవలు అందుతున్నాయన్నారు. సీసీఎస్ సభ్యుడు సుబ్బారావు, సూపరింటిండెంట్ పీవీ రావు, జ్యోతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

చనుబండ హైస్కూల్ సందర్శన



చాట్రాయి: మండలంలోని చనుబండ హైస్కూల్‌ను గురువారం ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ సందర్శించారు. ఇటీవల హైస్కూల్ నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు రాసేందుకు విస్సన్నపేట వెళుతున్నారు. ఈ కేంద్రం దూరంగా ఉండటంతో పరీక్షలు రాయడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఈహైస్కూల్లోనే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ హైస్కూలు ఉపాధ్యాయులు జిల్లా అధికారులకు ఇటీవల అర్జీ అందజేశారు. దీనిపై హైస్కూలును పరిశీలించి పదో తరగతి విద్యార్థుల నమోదు, పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, విస్సన్నపేట, చాట్రాయి గ్రామాల మధ్య దూరం లాంటి సమాచారాన్ని శ్రీకాంత్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీవైఈఓ సేవ్యానాయక్, హెచ్‌ఎం ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో ముందే సంక్రాంతి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ముసునూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, వేదికపై ప్రజాప్రతినిధులు

ముసునూరు: పింఛన్ల పెంపుతో ప్రతి ఇంటా సంక్రాంతి ముందుగానే వచ్చినట్లు ఉందని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి అధ్యక్షతన నూతన పింఛన్‌దారులు 163 మందికి పింఛను కానుకల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరం, కొత్తగా పెంచిన పింఛన్లతో ప్రతి పింఛన్‌దారు ఇంట పండుగేనన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనంత వ్యయంతో అత్యధిక సంఖ్యలో ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ కానుకలు పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మాత్రమేనన్నారు. రాష్ట్రంలోని మహిళల దెబ్బకు 23కే పరిమితమైన వారికి ఏంచేయాలో తెలియక సమర్థంగా పనిచేసే ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, ఈసారి ఆ 23 కూడా దక్కకుండా చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా పింఛన్‌దారులకు పింఛన్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ డి.సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్‌లు కంచర్ల వాణి, విజయలక్ష్మి, పిల్లి సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, సీహెచ్ దామోదరరావు, ఆర్.శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు తులిమెల్లి కృష్ణకుమారి, చీలి లక్ష్మి, కొండా దుర్గాభవాని, జి.సుబ్బారావు, వి.సుందరరావు, పి.వెంకటేశ్వరరావు పలుగ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపు ఘనత సీఎంకే దక్కింది

చాట్రాయి: పెన్షన్ల పెంపు ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను విడతలవారీగా పెంచుతూ రూ.3 వేలు చేస్తానన్న హామీ మేరకు రూ.2,750 పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ కోసం వారం నుంచి 10 రోజుల వరకు చెట్ల కింద పడిగాపులు పడ్డారని ఆయన గుర్తు చేశారు. ప్రచార ఆర్భాటంలో భాగంగా ఇరుకు రోడ్డు సందుల్లో సభలు పెట్టి ప్రజల ప్రాణాలు బలిగొంటున్న చరిత్ర చంద్రబాబుదే అని ఆయన ఆరోపించారు. అనంతరం 224 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, చెలికాని అనూష, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, నాయకులు దామెర ప్రసాదుబాబు, కారంగుల వాసు, పరసా చెన్నారావు, మాదల నరసింహారావు, పుచ్చకాయల అప్పిరెడ్డి, చల్లగుళ్ల వెంకటేశవరావు, చెలికాని శ్రీరాం, మిద్దె శివాజీ, ఎంపీటీసీలు, ఎంపీడీఓ ఎస్.మురళీమోహనరావు, తహసీల్దార్ విశ్వనాథరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మైలవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి, ప్రజాప్రతినిధులు

పేదలకు ఆర్థిక భరోసా

మైలవరం: పెంచిన పింఛన్ కానుకతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తెలిపారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పింఛన్లు అందజేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల సంక్షేమం కోసం ఒక అడుగు ముందుకు వేస్తే నేడు ముఖ్యమంత్రి జగన్ రెండడుగులు ముందుకు వేసి పేదలకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎస్.తిరుపతిరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, పుల్లూరు సొసైటీ అధ్యక్షుడు చిలుకూరి రామిరెడ్డి, సర్పంచ్ కోటమ్మ, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ప్రజాప్రతినిధులు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో పింఛన్ల పంపిణీ

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య, సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్టు, పాటిబండ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, రామినేని వీర స్వామినాయుడు, కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు నూనె అప్పిరెడ్డి, సునీల, ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, తోటకూర రవి, రామెళ్ల బాబురావు, మతాంగి వెంకటేశ్వరరావు, కట్లూరి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్‌లు బీమిరెడ్డి కృష్ణారెడ్డి, ఒగ్గు జమలారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మరీదు ధనలక్ష్మి, శెట్టిపల్లి మాధవిలత, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పాల్, ఎంపీడీఓ శంకరరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



కనసానపల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కనసానపల్లిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ పర్యటించి పథకాల లబ్ధిని వివరించారు. అర్హులకు పథకాలు రాకపోతే వారి సమస్యను పరిష్కరించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కూడా గెలిపించుకోవాలన్నారు. ఎంపీపీ లంకా నిర్మల, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీడీఓ సుహాసిని, సర్పంచ్ అమ్మిశెట్టి రమణ, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మశ్చా హరిబాబు, ఎంపీటీసీ సభ్యులు కారు తేజశ్విని, గ్రామ పార్టీ అధ్యక్షుడు అమ్మిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో విత్తనశుద్ధి తప్పనిసరి



చంద్రగూడెంలో రైతులకు సూచనలిస్తున్న డీడీఏ మాధవీలత, ఏడీఏ మోనీషా, అధికారులు

చంద్రగూడెం(మైలవరం): మొక్కజొన్న పంట సాగులో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని డీడీఏ మాధవీలత తెలిపారు. మండలంలోని చంద్రగూడెంలో మొక్కజొన్న పంట సాగుపై గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. శిక్షణా కార్యక్రమంలో డీడీఏ మాధవీలత మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో పురుగు మందులు విచ్చల విడిగా వాడటం వలన ఎక్కువ అనర్థాలు కలుగుతాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏడీఏ మోనీషా, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, ఏఓ సంధ్యారాణి రైతులకు పలు సూచనలిచ్చారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు

ఇబ్రహీంపట్నం(జికొండూరు): రబీసాగులో మొక్కజొన్న పైరుకు ఆశించిన కత్తెర పురుగు నివారణకు యాజమన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మాధవీలత అన్నారు. కుంటముక్కల గ్రామంలో రబీ సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు తెలిపారు. 2,700 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించలేదని ఏఓ రామ్‌కుమార్ తెలిపారు. ఈకేవైసీ నమోదుకు ఈనెల 7న కవులూరు, వెలగలేరు, వెల్లటూరు, కోడూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచి వంగూరి కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ మోనీషా, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

చాట్రాయి: మొక్కజొన్న పంటలో తెగుళ్ల నివారణ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం సీనియర్ సైంటిస్టు కె.ఫణికుమార్ అన్నారు. గురువారం చాట్రాయి గ్రామంలో మొక్కజొన్న పైరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటలో కాండం కుళ్లు తెగులు గుర్తించామన్నారు. దీని నివారణకు ఎకరానికి 4 నుంచి 5 కేజీల బ్లీచింగ్‌ని చల్లాలని, నీటిలో చల్లితే సమస్య ఉత్పన్నం కాదన్నారు. ఏఓ బి.శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలి

తిరువూరు: బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలని, బాల్యదశలో వివాహాలు చేసుకుంటే అనర్థాలు కలుగుతాయని తిరువూరు స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధి ప్రాజెక్టు అధికారి సత్యవతి సూచించారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యవతి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యావకాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు లేకపోతే మనుగడ సాగించడం కష్టమని సూచించారు. జేవీవీ సమతా కన్వీనర్ ఉషారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, సభ్యులు రాంప్రదీప్, హరికృష్ణ, శరత్, సుదర్శన్, వసతిగృహ సంక్షేమాధికారి సంపూర్ణ పాల్గొన్నారు.

పాసుబుక్‌లకు దరఖాస్తు చేసుకోండి

గంపలగూడెం: అగ్రిమెంట్‌పై భూములు కొనుగోలు చేసిన రైతులు పాస్‌బుక్‌లకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. 2021 సెప్టెంబర్ 30వ తేదీలోపు అగ్రిమెంట్ మీద భూములు కొనుగోలు చేసిన వారు పాస్ బుక్ పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే పాస్‌పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

గంపలగూడెం: రబీ సీజన్‌లో వివిధ రకాల పైర్లు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీ తెలిపారు. మొక్కజొన్న, జొన్న, మినుము, కూరగాయాలు తదితర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. సాగునీటి వసతి లేని భూముల్లో రబీ వరి సాగుకు చేయవద్దన్నారు.

వ్యాపారిని అరెస్టు చేయాలని వినతి

చాట్రాయి: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్న ప్రైవేటు వ్యాపారి కిషోర్‌ని అరెస్టు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలసాని వెంకట రామారావు గురువారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. వ్యాపారిని అరెస్టు చేసి రైతులకు డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వ్యాపారిని వెంటనే అరెస్టు చేయాలని నూజివీడు సీఐ అంకబాబును ఆదేశించారు. రాష్ట్ర రైతు సంఘం నాయకులు పి.జమలయ్య, బత్తుల వెంకటేశ్వరావు, రాయల లక్ష్మణరావు, చలసాని నరేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తిరువూరు: భారతీయ జీవిత బీమా సంస్థ తిరువూరు శాఖ స్థానిక శ్రీనిధి స్కూల్ విద్యార్థులకు గురువారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసింది. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు బహుమతులను ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ శివశ్రీ అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ కిషోర్, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, అకడమిక్ ఇన్‌చార్జి నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్నాలజీ, ఫైనాన్సియల్ సర్వీసెస్‌పై వెబినార్

ఇబ్రహీంపట్నం: నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నాలజీ, ఫైనాన్సియల్ సర్వీసెస్ అంశంపై జాతీయ వెబినార్ గురువారం నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా ఫాఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు తన్నీరు రవి పాల్గొని నూతన టెక్నాలజీతో ఆధార్ ద్వారా బ్యాంకుల నగదు బదిలీ, యూపీఐ, రానున్న రోజుల్లో ఆటోమేషన్ విభాగంలో ఫైనాన్స్ ఉత్పత్తులు, ఉద్యోగ అవకాశాల అంశాలను వివరించారు. నైపుణ్యాల పెంపునకు విద్యార్థులు ఎంచుకోవల్సిన పద్ధతులు తెలియజేశారు. అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రిన్సిపాల్స్ అక్బర్‌ఖాన్, అబ్దుల్ బాజీ పాల్గొన్నారు.

వరిపైరులో తెగుళ్ల నివారణకు చర్యలు

మునుకుళ్ల(తిరువూరు): దాళ్వా వరిపైర్లలో ఉల్లికోడు, ఆకుముడత తెగుళ్లు ఆశించినందున రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. మండలంలోని మునుకుళ్ళలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఉల్లికోడు నివారణకు పిలక దశలో ఎకరాకు కార్బోఫ్యురాన్ 3 గ్రాముల గుళికలను 10 కిలోలు లేదా ఫోరేట్ 10 గ్రాముల గుళికలు 5 కేజీలు వేయాలన్నారు. ఆకుముడత నివారణకు ఎకరాకు కారటాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం పొడి మందును చల్లాలని సూచించారు.

గ్రామాభివృద్ధికి కృషి

ఆంజనేయపురం(తిరువూరు): ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆంజనేయపురం గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు అన్నారు. గ్రామ సచివాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ కృషి చేస్తోందన్నారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి ఆర్థిక వనరుల పెంపునకు తోడ్పడాలని సూచించారు. గతేడాదిలో గ్రామానికి మంజూరైన నిధులు, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఉప సర్పంచ్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

నూజివీడు: ఫిబ్రవరి 28లోగా ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని, యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూజివీడు యూనిట్ సంఘం అధ్యక్షుడు వంగల గోవిందరావు తెలిపారు. పట్టణంలోని రైతుబజారు రోడ్డులో ఉన్న ఎన్జీఓ హోమ్ ఆవరణలో గురువారం ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూజివీడు యూనిట్ సమావేశాన్ని గోవిందరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. బకాయిల చెల్లింపులపై సంఘం రాష్ట్ర నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు కోరారు. పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ మేస్త్రి కుటుంబానికి సాయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆర్సీఎం కాలనీకి చెందిన సెంట్రింగ్ మేస్త్రి జాన్ కిషోర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్ కిషోర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జ్యానేష్, కొప్పుల కుమార్, మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ప్రదీప్(ఫైల్)

ఊటుకూరు(గంపలగూడెం): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఊటుకూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ వి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ఊటుకూరుకు చెందిన నల్లగట్ల ప్రదీప్(27) కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 14న ఇంటి వద్ద పురుగు మందు తాగాడన్నారు. వెంటనే కుటుంబీకులు అతనిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారన్నారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ప్రదీప్ పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందాడని తెలిపారు. ప్రదీప్ మండలంలోని దుందిరాలపాడు గ్రామ సచివాలయ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. భార్య గర్భవతి, ఘటనపై మృతుని తల్లి సామ్రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామన్నారు.

కరెంట్ అఫైర్స్‌పై అవగాహన అవసరం



మైలవరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కరెంట్ అఫైర్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ లక్ష్మీ కుమారి తెలిపారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఆఫీస్ అసిస్టెంట్‌షిప్(ఒకేషనల్) కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కెరీర్ గైడెన్స్‌పై ఆన్ ది జాబ్ ట్రైనింగ్ శిక్షణ ఇచ్చారు. ఒకేషనల్ అధ్యాపకులు వై.వి.లక్ష్మీరాజ్యం, జె.రామ్మోహనరావు, ఎంఈఓ రత్నశ్యామ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

9 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

తిరువూరు: ఈ నెల 9 నుంచి తిరువూరులో శ్రీత్యాగరాజ స్వామి సంగీత ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు త్యాగరాజ గానకళాసమితి కార్యదర్శి మురుకుంట్ల సీతారామలింగేశ్వర శర్మ తెలిపారు. 9న త్యాగరాజస్వామి నగరోత్సవం, సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణం, చిత్రాల నారాయణ నాదస్వర కచేరీ, దేవీ నీహారిక గాత్ర కచేరీ, బుర్రా పద్మనాభశర్మ హరికథా గానం, 10న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, కొల్లిపర శ్వేత గాత్రకచేరీ, యండూరి శిఖామణి హరికథా గానం జరుగుతుందన్నారు. 11న వెంకటేశ్వరస్వామి కల్యాణం, యడవల్లి పద్మావతి గాత్రకచేరీ, కాలపుటపు శ్యామ, శ్రీవల్లి, శ్రీలత తదితరుల పంచరత్నగానం, 12న బాలా త్రిపురసుందరీదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం, సోమయాజుల ఉషామాధురి గాత్రకచేరీ, మొగిలిచర్ల నాగమణి హరికథా గానం, 13న శ్రీసీతారామకల్యాణం, పట్టాభిషేకం, తనిలయ విద్వాంసుల వాయిద్య గోష్ఠి, అన్నం సువర్చల ధనశ్రీ నృత్య ప్రదర్శన, నేమాని నాగలక్ష్మి భాగవతారిణి హరికథా గానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. గత 69 ఏళ్లుగా ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శర్మ వెల్లడించారు.

రికార్డు సృష్టించిన మల్లె ధర

చంద్రగూడెం(మైలవరం): మండలంలోని చంద్రగూడెం మార్కెట్‌లో మల్లెపూలు రికార్డు ధర పలికింది. ప్రస్తుతం మల్లె పూలు కిలో రూ.800 వరకు పలుకుతుందని రైతులు తెలిపారు. ఈ సీజన్‌లో ఈ ధర రావడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మల్లె పూలకు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో గిరాకీ ఉందని చెప్పారు.

నేటి కార్యక్రమాలు

వేమిరెడ్డిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో తువ్వచిలుక, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గం గురువారం తెలిపింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించటంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

కొత్తపల్లి రహదారికి శంకుస్థాపన

కొత్తపల్లి(గంపలగూడెం): గంపలగూడెం మండలంలోని కొత్తపల్లి రహదారికి ఎమ్మెల్యే కె.రక్షణనిధి శుక్రవారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రూ.4 కోట్లతో ఎన్జీ రోడ్డు నుంచి కొత్తపల్లి శివారు తెలంగాణా రాష్ట్ర సరిహద్దు వరకు రహదారిని నిర్మిస్తారన్నారు.

ఓటీఎస్ పట్టాల పంపిణీ

చాట్రాయి: అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం ఓటీఎస్ పట్టాలను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తహసీల్దార్ విశ్వనాథరావు గురువారం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా సీఎం జగన్ మామ లక్ష్యాన్ని నెరవేర్చాలని గొల్లపూడి సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు అన్నారు. గొల్లపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదవ తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీటీసీ పైలా ఆదినారాయణ, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అల్తాఫ్, హెచ్‌ఎం ఆర్.హైమేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ పద్ధతులతో చీడపీడల నివారణ



గణపవరం(మైలవరం): మామిడి తోటల్లో చీడపీడల నివారణకు సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలని ఉద్యాన శాఖ మండల అధికారి అహ్మద్ తెలిపారు. గణపవరం గ్రామంలో గురువారం తోటబడి నిర్వహించి రైతులకు మామిడిని ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై క్షేత్ర సందర్శన నిర్వహించి తగు సూచనలిచ్చారు. పూత దశలో ఆశించే తేనెమంచు పురుగు, తామర పురుగు, బూజు తెగులు, మచ్చ తెగులు తదితర చీడపీడలపై రైతులకు సస్యరక్షణ పద్ధతులు తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడి పంట సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటే మొత్తం వ్యయంలో 75 శాతం రాయితీ రూపంలో ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామ ఉద్యానశాఖ సహాయకుడు బి.మహేష్, రైతులు పాల్గొన్నారు.